హైదరాబాద్ వార్త





రామకృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న బండారు దత్తాత్రేయ తదితరులు

## గొప్ప సంస్కర్త బూర్గుల రామకృష్ణారావు

### హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రిగా పరిపాలనలో పలు సంస్కరణలు చేసిన గొప్ప సంస్కర్త బూర్గుల రామకృష్ణారావు అని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. గురువారం బూర్గుల రామకృష్ణారావు 56వ వర్ధంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పైనున్న ఆయన విగ్రహం వద్ద బూర్గుల రామకృష్ణారావు ఫౌండేషనన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. అనంతరం దత్తాత్రేయ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో కీలకమైన మార్పులు తెచ్చిన బూర్గుల రామకృష్ణారావు భూసంస్కరణలతో పాటు విద్యాసంస్కరణలు చేసిన మేధావి అని గుర్తు చేశారు. బూర్గుల రామకృష్ణారావు స్వాతంత్ర్య సమరయోధుడు, మంచి విద్యావంతుడు, బహుభాషా కోవిదుడు అని, అటువంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ కే.రామచంద్రమూర్తి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు, బూర్గుల రామకృష్ణారావు కుమారుడు బూరుగుల లక్ష్మణ్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాలకు విగ్రహాలు రెడీ

- నగరంలో ఊపందుకున్న కొనుగోళ్లు
- పివోపి విగ్రహాలతో పాటు మట్టివిగ్రహాలకు డిమాండ్
- ఎన్నికల నేపథ్యంలో వందల సంఖ్యలో విగ్రహాలకు నేతల అడ్వాన్సులు
- కాలనీలు, బస్తీల్లో తామే ఇప్పిస్తామని హామీ



**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** వినాయక నవరాత్ర్సవాల నేపథ్యంలో నగరంలో గణపతి వవిగ్రహాల తయారీ కొనగోళ్లు ఊపందుకున్నాయి. అదేవిధంగా అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండగా ఈఏడాది వినాయక మండపాలు పెద్దసంఖ్యలో ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఇప్పటినుంచే ఓటర్లను తమవైపుకు తిప్పుకునేందుకు అన్నిపార్టీల నేతలు గణపతి విగ్రహాల కొనుగోలు ప్రారంభించారు. బస్తీలు, గల్లీలు, గణేష్ మండాపల ఖర్చులు భరించేందుకు సైతం సిద్దమవుతున్నట్లు తెలుస్తుంది. దీంతో ఈసారి వినాయక ఉత్సవాల వ్యాపారం భారీగానే కొనసాగనుంది. ఇప్పటికే మండపాల నిర్వాహకులు విగ్రహాలకు అడ్వాన్స్ ఇచ్చి రిజర్వ్ చేసుకోగా మరికొందరు తీసుకెళ్లేపనిలో పడ్డారు. గ్రేటర్‌హైదరాబాద్‌లో లో దాదాపు 3 లక్షల పెద్దవిగ్రహాలు తయారు చేస్తున్నారు. ధూల్‌పేట్, ఉప్పల్, నాగోల్, పెద్దఅంబర్‌పేట్, మియాపూర్, తదితర ప్రాంతాల్లో విగ్రహాల తయారీ ఖార్ఖానాలు దాదాపు 500 వరకు ఉంటాయి. అమ్మకాలతో ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలమంది ఉపాధి పొందుతుంటారు. కరోనా కారణంగా రెండళ్ల విగ్రహాలు తయారీ దెబ్బతినగా..గతేడాది నుంచి పుంజుకుంది. పెద్దవిగ్రహాలకు స్థానికంగా చేస్తుండగా, చిన్నవి షోలాపూర్ నుంచి బల్క్‌గా తీసకువచ్చి హోల్‌సేల్‌లో అమ్మకాలు జరుపుతున్నారు. ఇతర రాష్ట్రాల వాళ్లు సైతం ఆర్డర్ చేసి కొనుగోలు చేస్తున్నట్లు దూల్‌పేట్ వ్యాపారులు తెలుపుతున్నారు.

**ఇంకా పివోపితోనే తయారీ ..**

పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పివోపి)తో తయారు చేసే విగ్రహాలతో పోలిస్తే మట్టితో చేసినవవి మేలని నిపుణులు పేర్కొంటున్నారు. కొన్నేండ్లుగా మట్టిగణపతుల పైనా జనాల్లో అవగాహన పెరిగింది. అయితే వీటి తయారీలో ఇబ్బందులు ఉన్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. ఎక్కవ కాలం నిల్వ ఉంచడం సాధ్యం కాదని ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో అయితే సులభంగా తయారు చేయొచ్చునని చెబుతున్నారు. అదేమట్టితో అయితే చేతులో నొక్కుతూ చేయాల్సి ఉంటుందని దీంతో మట్టివిగ్రహాల తయారీకి కార్మికులు ఇష్టపడటంలేదని పేర్కొంటున్నారు. ఎనిమిది ఫీట్ల పిఓపి విగ్రహ 20వేలు ఉంటే ..మట్టి విగ్రహం ధర 30వేల వరకు ఉంటుందని పేర్కొంటున్నారు. అలాగే ముడి సరుకుల ధరలు, కూలీల రేట్లు పెరగడటంతో విగ్రహాల రేట్లు పెంచక తప్పడం లేదని తయారీ దారులు పేర్కొంటున్నారు.

## ముంచెత్తిన వాన

- పలుచోట్ల కుండపోత వర్షం
- జలమయమైన రోడ్లు
- చెరువులను తలపించిన కాలనీలు
- ట్రాఫిక్ జామ్‌తో నరకయాతన



**హైదరాబాద్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త**

కుండపోత వర్షం కురిసింది. గురువారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. భారీ వర్షానికి జన జీవనం పూర్తిగా అస్తవ్యస్తం అయింది. ఏకదాటిగా కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు నీటమునగగా..లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల ఇళ్లలోకి నీరు చేరి సామాగ్రి తడిచిపోయింది. కాలనీలు చెరువులను తలపించాయి. కొన్నిచోట్ల రహదారులపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు, మురికివాడలు వరద నీటితో నిండిపోయాయి. పలుప్రాంతాల్లో అపార్టుమెంట్ సెల్లార్లు, ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. మూసీలో వరద ప్రవాహం పెరగడంతో పరివాహక ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. బల్కంపేట లోతట్టు ప్రాంతాల్లో మోకాళ్ల లోతు వర్షపు నీరు నిలిచింది. అలాగే అండర్ పాస్ బ్రిడ్జివద్ద భారీగా వరదనీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. హుస్సేన్‌సాగర్‌లోకి భారీగా వరద వచ్చి చేరింది. లింగంపల్లి అండర్‌పాస్ వంతెనపై భారీగా వరదనీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అదే విధంగా పలు ప్రాంతాల్లో రోడ్లపై గుంతల్లో వరద నీరు నిలవడంతో వాహనాలు నిదానంగా వెళ్లడం వల్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది.

భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. మ్యాన్‌హోల్ పొంగిపొర్లి మురుగు నీటితో కలిసి దుర్వాసన రావడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో అయితే రోడ్లు చెరువుల్లా మారిపోయాయి. ఖైరతాబాద్, నాంపల్లి, బేగంపేట, అమీర్‌పేట, జీడిమెట్ల, సూరారం, బాలానగర్, కూకట్‌పల్లి, కూకట్‌పల్లి, అల్వీన్‌కాలనీ, హైదర్‌నగర్, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి, బేగంపేట్, సికింద్రాబాద్, ప్యాట్నీ, పారడైజ్, చిలకలగూడ, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్, బోరబండ, నారాయణగూడ, హిమాయత్‌నగర్, అబిడ్స్, కోఠి, బేగంబజార్, సుల్తాన్ బజార్, నాంపల్లి, బషీర్‌బాగ్, పంజాగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేట, దోమలగూడ, ట్యాంక్‌బండ్, తార్నాక, బోడుప్పల్, నాచారం, హయత్‌నగర్, ఎల్బీనగర్, అమీర్‌పేట, చంద్రాయణగుట్ట, పాతబస్తీలోని తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. బోయిన్‌పల్లి, మారేడుపల్లి, అల్వాల్, బాలాజీనగర్, ప్యాట్నీ ప్యారడైజ్, బేగంపేట్ ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. కుత్బుల్లాపూర్, చింతల్, గుండ్లపోచంపల్లితో పాటు అనేక ప్రాంతాలు నీటీమయమయ్యాయి. బోయిన్‌పల్లి ప్రాంతంలోని పలుకాలనీలు జలమయమయ్యాయి. హస్మత్‌పేట ప్రధాన రహదారిపై మోకాళ్లలోతు నీరు రావడంతో ఆ ప్రాంతమంతా చెరువును తలపిస్తోంది. రామన్నకుంట చెరువుసమీపంలోని శ్రీనివాసనగర్ కాలనీలో రమదారిపై పూర్తిగా నీరు నిలిచి వాహనాలు మునిగిపోయే పరిస్థితి నెలకొంది. చింతల్‌లోని ఇంద్రసింగ్‌నగర్‌లో ఇళ్లలోకి వరద నీరు చేరుకోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అమీర్‌పేటలోని మైత్రీవనం వద్ద రోడ్డు పైకి భారీగా వరద నీరు చేరింది. ఎర్రగడ్డ ప్రధాన రహదారిపై మోకాళ్ల లోతు వర్షపు నీరు నిలిచిపోయింది.

**గంటల కొద్ది రోడ్లపైనే వాహనాలు..**

నిమిషాల ప్రయాణానికి గంటల సమయం పట్టడంతో ప్రయాణికులు నరకం అనుభవించారు. కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, లింగంపల్లి, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, చందానగర్, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్, పంజాగుట్ట, ఎస్సార్‌నగర్, కూకట్‌పల్లి నుంచి అమీర్‌పేట, హిమాయత్‌నగర్, బేగంపేట్, సికింద్రాబాద్, హబ్సిగూడ, నాచారం తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఏర్పడింది. ఖైరతాబాద్ మీదుగా కోఠి వెళ్లే రోడ్‌లో వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. అమీర్‌పేట నుంచి మాదాపూర్ వెళ్లే మార్గంతోపాటు పంజాగుట్ట నుంచి కొండాపూర్ రోడ్డు, సికింద్రాబాద్ నుంచి జూబ్లీహిల్స్, మాదాపూర్ మీదుగా హైటెక్‌సిటీ వెళ్లేరోడ్డు మొత్తం వాహనాలతో బ్లాక్ అయింది. జేఎన్టీయూ నుంచి హైటెక్‌సిటీ మార్గంలో భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. ఒక్కో వెహికిల్ ఇంటికి చేరడానికి కనీసం గంట సమయం పట్టింది. ట్రాఫిక్ పోలీసులు ఉన్నా..అనూహ్యంగా పెరిగిన వాహనాల రద్దీతో ఏం చేయలేకపోయారు. నగరంలో ప్రధానరోడ్లు లింగంపల్లి నుంచి ఖైరతాబాద్, సికింద్రాబాద్ నుంచి హైటెక్ సిటీ వరకు, హబ్సిగూడ- నాచారం, ఉప్పల్-మేడిపల్లి.. వరంగల్ జాతీయ రహదారిలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి.



మాట్లాడుతున్న సాయిబాబా

## ప్రతిపక్షాన్ని నిర్వీర్యం చేయడానికే చంద్రబాబు అరెస్ట్

### టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సాయిబాబా

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** ప్రతి పక్షాన్ని ఒక పథకం ప్రకారం నిర్వీర్యం చేసేందుకు జగన్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలోభాగమే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు అయిన చంద్రబాబునాయుడిని అక్రమంగా అరెస్ట్ చేయటమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆరోపించారు. గురువారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడి అరెస్ట్‌ని తెలుగు రాష్ట్రాల ప్రజలందరూ వ్యతిరేకిస్తూ, నిరసనలు తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా మొండిగా వ్యవహరించటం విచారకరమని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ప్రధాన భాగస్వామ్యమైన సీమెన్స్ కంపెనీ యాజమాన్యం దీనిలో ఎటువంటి అవినీతి జరగలేదని స్పష్టంగా చెబుతున్నా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఎంతో మంది యువకులు లబ్ధి పొందామని బాహాటంగా చెబుతున్నా వాటిని పరిగణలోకి తీసుకోకుండా చంద్రబాబునాయుడిపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయటం పిరికిపంద చర్య అని, జగన్ పాలన హిట్లర్ పాలనను గుర్తుకు తెస్తోందని ఎద్దేవా చేశారు. ఎటువంటి అవినీతి జరగలేదని ఎంత మంది అధికారులు చెబుతున్నప్పటికీ పట్టించుకోకుండా సీబీఐని అడ్డం పెట్టుకుని జగన్ చంద్రబాబునాయుడిపై కక్షసాధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దోజు రవీంద్రాచారి, ప్రశాంత్‌యాదవ్, జోగిందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేయాలి

**సైఫాబాద్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను వెంటనే రద్దు చేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌గా మార్చాలని పరిషత్ ఎంప్లాయిస్ జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం జెఎసి ప్రతినిధి బృందం సచివాలయంలోని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కార్యాలయంలో ఉన్నతాధికా రులకు వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా జెఎసి ఛైర్మన్ డా.వినయ్‌కుమార్, కో-ఛైర్మన్ డా.రవుఫ్, కన్వీనర్ సోమ్ మల్లయ్య, కో-ఛైర్మన్లు సత్యనారాయణరెడ్డి, పరభ్‌కుమార్, కరుణాకర్ తదితరులు మాట్లాడుతూ పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు కింద ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని, మెడికల్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ అయిన పరిషత్ వైద్యశాలలోని ప్రమోషన్ పోస్టులను యధావిధిగా ఉంచి పదోన్నతులు కల్పించాలని పరిషత్‌కు అవసరం ఉన్న పోస్టులను క్రియేట్ చేస్తూ స్టాఫ్ రిస్ట్రక్చర్ చేయాలని కోరారు. పరిషత్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని పర్మినెంట్ చేయాలని, వీరితో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.



వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు ఛాంబర్‌లో పాల్గొన్న జెఎసి నాయకులు





ఓటరు అవగాహన సదస్సులో పాల్గొని బ్యానర్ను ప్రదర్శిస్తున్న అధికారులు

## దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకోవాలి

### జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి

**జవహర్ నగర్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** దివ్యాంగులందరూ ఎన్నికల్లో తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మేడ్చల్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి కోరారు. గురువారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ద్వాక్రా భవనంలో దివ్యాంగులతో ఓటర్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం రవాణా సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి దివ్యాంగుడు కొత్తగా ఓటర్ ను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులు వివిధ సమస్యలను అధికారులతో విన్నవించగా సానుకూలంగా స్పందించిన అధికారులు సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ అధికారి యాదయ్య, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డి ఈ మాధవాచారి, తెలంగాణ వికలాంగుల రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గాప్రసాద్, అంగన్వాడి సూపర్వైజర్ ధనలక్ష్మి, మేడ శ్రీను, ప్రియాంక, శోభ, ధనరాజ్, పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

## గాంధీ మెడికల్ కాలేజీ 69వ వార్షికోత్సవాలు

**అడ్డగుట్ట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** వైద్యరంగానికి సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేయడంతోపాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేయడంలో వైద్య విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని గాంధీ మెడికల్ కళాశాల ఆలుమ్ని అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ రాజారెడ్డి, గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావులు పిలుపునిచ్చారు. గురువారం సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కళాశాల 69వ వార్షికోత్సవ వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపి.ఆర్. బేసిక్, లైఫ్ సపోర్ట్‌లపై దాదాపు 10 వేల మందికి ఉచిత శిక్షణ అందించామని అలుమ్ని అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ జి.ఆర్.లింగమూర్తి తెలిపారు. మెడికల్ కళాశాలలో గత సంవత్సరం ప్రతిభకనబర్చిన వైద్య విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందించడంతో పాటు నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఉచితంగా అందిస్తున్నామన్నారు. రోగుల ప్రాణాలు కాపాడేందుకు కరోనా సమయంలో 2 కోట్ల విలువ చేసే వైద్య యంత్రాలు, పరికరాలు, మాస్కులు, శానిటైజర్లను తెలంగాణలోని ప్రభుత్వ ఆసుపత్రులకు పంపిణీ చేశామన్నారు. అదే విధంగా ఆయా విభాగాల్లో అత్యుత్తమంగా ప్రదర్శించిన 36 మంది విద్యార్థులకు బంగారు పతకాలతో పాటు ప్రశంసపత్రాలు అందజేశారు. అదే విధంగా వైద్య విద్యను బోధించిన అనాటి గురువులు డాక్టర్ సుజాత, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ శ్రీరామ్‌రెడ్డి, డాక్టర్ మనోహర్ రెడ్డిలకు శాలువకప్పి జ్ఞాపికను అందజేసి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల వైద్యులు మహేశ్వర్ రెడ్డి, విజయారావ్, భాస్కర్ రెడ్డి, రజీత, నాగార్జున చక్రవర్తి, లక్ష్మి నారాయణ, రాజేశ్, రామక్రిష్ణ, రోహిత్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు, వైద్యులు పెద్ద ఎసంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల్లో బిసిలకు యాభై శాతం సీట్లు కేటాయించాలి





టీపిసీసీ, ఓబిసి ఛైర్మన్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాగేశ్

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిసీల కు జనాభా ప్రాతిపదికన యాభై శాతం సీట్లు కెటాయించాలని కోరుతూ బిసీ శక్తి సంఘం అధ్యక్షులు పిట్ల నాగేశ్, కన్వీనర్ నాగుల శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శంకర్ చారిలు, టీపిసీసీ, ఓబిసీ ప్రధాన కార్యదర్శి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీలో బిసీ బడ్జెట్‌కు ప్రత్యేక నిధులు కెటాయించాలని బిసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని, బిసి సిఎంను ప్రకటించాలని, 2009లో మాజీ ముఖ్య మంత్రి డాక్టర్ వైస్ రాజశేఖర్ రెడ్డి విడుదల చేసిన జీవో నెం 15ను ముదిరాజ్‌లను బిసీఏలో మార్చాలోకి మార్చాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రొ. రోజారాణికి అమెరికన్ అసోసియేషనప్ క్యాన్సర్ రీసర్చ్ గుర్తింపు

**తార్నాక, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** ఒయు జెనెటిక్స్ అధ్యాపకురాలు ప్రొ. అనుపల్లి రాజారాణికి అరుదైన గుర్తింపు లభించింది. అమెరికన్ అసోసియేషన్ క్యాన్సర్ రీసర్చ్(ఏఏసీఆర్) యూనైటెడ్ స్టేట్స్ నుంచి ఈ ప్రతిష్టాత్మక గుర్తింపును పొందారు. ఆమె చేసిన నాణ్యమైన పరిశోధనతో పాటు 75 కంటే ఎక్కువ జాతీయ, అంతర్జాతీయ పరిశోధన ప్రచురణలు, అంతర్జాతీయ పేటెంట్లు, క్యాన్సర్ జీవశాస్త్ర రంగాల్లో పరిశోధన కోసం ఈ అసోసియేషన్‌లో క్రియాశీల సభ్యత్వాన్ని పొందారు. ఆమె మార్గదర్శకత్వంలో 11 మంది పరిశోధకులు తమ పిహెచ్‌డీ పూర్తి చేశారు. 8 మంది ఆమె కింద ప్రస్తుతం పరిశోధనలు చేస్తున్నారు.

## మహిళా దక్షత సమతి ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవం

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**

జీవితంలో ఉన్నతశిఖరాలకు చేరుకునేందుకు ప్రతి విద్యార్థికి కమ్యూనికేషన్ నిపుణతతో పాటు హిందీభాషపై మంచిపట్టు ఉండటం అవసరమని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆశోక్ లోహతి అన్నారు. చందానగర్‌లోని సుమన్ బాలికల జూనియర్ కళాశాల, విడీ బజాజ్ మహిళా డిగ్రీ కళాశాల, మహిళా దక్షత సమితి విద్యాసంస్థల కళాశాల ప్రాంగణంలో గురువారం హిందీ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆశోక్ లోహతి మాట్లాడుతూ.. మహిళా దక్షతసమితి విద్యార్థుల భవిష్యత్తును తీర్చేందుకు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో మహిళా దక్షత సమితి అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్‌బజాజ్, మున్నా జకేటియ, అనురాధ, అనసూయ, కళాశాల ప్రిన్సిపాల్ రమాకుమారి, సుశిలపాటిల్, విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## నాలెడ్జ్ సిటీని సందర్శించిన డచ్ దేశస్తులు





సమావేశంలో నెదర్లాండ్ కాన్సుల్ జనరల్ ఈవాట్ డివైట్, మార్టిన్‌స్కిడ్, భార్గవ్, ఐజీరెడ్డి తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** నాలెడ్జ్ సిటీలోని గ్లిబియా, ప్లానస్ సంస్థలను నెదర్లాండ్స్ కాన్సుల్ జనరల్ (సౌత్‌ఇండియా)ఈవాట్ డివైట్, ఇండస్ట్రియల్ పాలసీ టాప్‌సెక్టార్స్ డైరెక్టర్ మార్టిన్ స్కిడ్స్ గురువారం సందర్శించారు. న్యూఢిల్లీలో తాజాగా జరిగిన జీ20 సదస్సు అనంతరం వారు ఒక్కడికి విచ్చేశారు. ఈసందర్భంగా గ్లిబియా సంస్థ వైస్‌ప్రెసిడెంట్ భార్గవ్, డొమైమ్ హెడ్ ఐజీరెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ అత్యాధుక సదుపాయయాలో 16కంటే ఎక్కువ సంస్థలకు చెందిన ప్రతినిధులతో తీర్చిదిద్దబడిందని తెలిపారు. విభిన్నరంగాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న తాము సాఫ్ట్‌వేర్ ప్రాడక్ట్ డెవలప్‌మెంట్ సంస్థలకు సాంకేతిక పురోగతితోపాటు కీలకమైన సాంకేతికతను అందిస్తున్నామని వివరించారు. ఈపర్యటన భారత్-నెదర్లాండ్ మధ్య ఆలోచనలు పంచుకోవడంతోపాటు ఆయా రంగాలల్లో అవసరంమైన అవగాహను పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు.





హిందీ దివస్‌లో ప్రసంగిస్తున్న రాష్ట్ర ఛైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి. చిత్రంలో పల్లె రవికుమార్, టి.రాజాసింగ్ తదితరులు

## ఆక్రమణకు గురవుతున్న చెరువులు

- చేతివాటిమే ప్రధానం..చర్యలు శూన్యం..?
- నీటిపారుదల అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు..
- ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికుల డిమాండ్
- ప్రశ్నార్థకంగా ప్రభుత్వ మహోత్తర ఆశయం

**దుండిగల్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**

సమైక్య పాలకుల పాలనలో జీవం కోల్పోయిన జలవనరులను ఎలాగైనా కాపాడుకోవాలి.. పునరుజ్జీవం పోసి పూర్వవైభవం తీసుకురావాలనే మహా సంకల్పంతో కెసిఆర్ ప్రభుత్వం మహోత్తర ఆశయానికి పూనుకుంది. మిషన్‌కాకతీయ పథకాన్ని ప్రవేశపెట్టి చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. దీంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని చెరువులు నిండుతనాన్ని సంతరించుకొని కళకళలాడుతుండగా గండిమైసమ్మ-దుండిగల్ మండల పరిధిలోని చెరువుల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. అభివృద్ధి, జలకళ దేవుడెరుగు ఉన్న చెరువుల ఉనికే లేకుండా పోతుంది. చెరువులను పూడుస్తూ ఆక్రమిస్తున్నారు. పట్టపగలే నిర్మాణలు కొనసాగిస్తూ కల్పతరువులను కబలిస్తున్న చర్యలు చేపట్టరు. నీటిపారుదల అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా పలు చెరువులు, కుంటలు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. చేతివాటమే ప్రధానంగా, లక్ష్యంగా పనిచేస్తున్నప్పుడు చర్యలు ఎలాతీసుకుంటారని పలువురు అభిప్రాయపడుతున్నారు. నీటిపారుదలశాఖ అధికారుల తీరుతో ప్రభుత్వ మహత్తర ఆశయం ప్రశ్నార్థకంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించకుంటే కొద్ది రోజుల్లో జలవనరులను భౌతికంగా చూడలేము.. కాగితాలపైన మాత్రమే కనిపిస్తాయని వినికిడి.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గండిమైసమ్మ-దుండిగల్ మండలం, దొమ్మరపోచంపల్లి పరిధిలో అధికారుల గణంకాల ప్రకారం.. కుడికుంట-27, నార్లకుంట-27, ఈర్లకుంట-7, చింతలకుంట-15,



చింతలకుంట ఎఫ్‌టిఎల్‌లో అక్రమంగా కొనసాగుతున్న బహుళ అంతస్థుల భవనం

కంబాలకుంట-11, పడగసముద్రం-8, పెద్దగంగన్న కుంట, చిన్నగంగన్నకుంటలు-2.10, ముల్లవాణి కుంట-4, కుడిమూలబావి-6, గొల్లవాణికుంట-3 ఎకరాల విస్తీర్ణాలలో జలవనరులు కలవు. చింతల కుంట రెండు ఎకరాలకుపైగా ఆక్రమణకు గురైంది. ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్లలో ఇప్పటికే పదుల సంఖ్యలో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కుడికుంట ఎఫ్‌టిఎల్, బఫర్‌లలో పలు నిర్మాణాలు జరుగుతుండగా చెరువు నాలాలను ఆక్రమించేశారు. చెరువు కట్ట కింద పదుల సంఖ్యలో భారీ షెడ్ల నిర్మాణాలు చోటు చేసుకున్నాయి. చిన్నగంగన్న, పెద్దగంగన్న కుంటల పరిస్థితి ఇదే. మీడిముళ్ళవాణి కుంటలో నుండి సిసిరోడ్డు వేశారు. ఈర్లకుంటను ఆక్రమించి లేఅవుట్ చేసి ప్రహరీని నిర్మించారు. ఇలా ప్రతి చెరువు, కుంటను ఎదో ఒకవైపు ఆక్రమణలకు పాల్పడుతూనే ఉన్నా నీటిపారుదలశాఖ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తనట్లు ప్రవర్తిస్తున్నారు.

**అలావెళ్లి ఇలా వచ్చారు...**

చింతలకుంటలో జరుగుతున్న ఆక్రమణలపై ఫిర్యాదులు అందుకున్న నీటిపారుదలశాఖ అధికారులు సందర్శించి ఆక్రమణలు గుర్తించారు. రెవిన్యూ, మున్సిపల్ విభాగాలతో కలిసి జెసిబితో సహా నిర్మాణాల వద్దకు వెళ్లారు. హడావుడిగా అక్కడికి చేరుకున్న అధికారులు సదరు నిర్మాణాలను కనీసం తాకకుండానే వెనుదిరిగి వచ్చారు. నిర్మాణాదారుల ధనబలాన్ని తలొగ్గారా..? ప్రజాప్రతినిధుల సిఫార్సులకు సైఅన్నారో..? తెలియదుగాని చెరువులో ఆక్రమణలపై ఎటువంటి చర్యలు చేపట్టలేకపోయారు. ఈ సంఘటన నీటిపారుదలశాఖ అధికారుల విధి నిర్వహణకు చిన్న ఉదాహరణగా పలువురు పేర్కొంటున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి...**

ఉన్నతాధికారులు స్పందించి చెరువులు, కుంటల్లో ఆక్రమణదారులపై, వారికి సహకరిస్తున్న అదికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే చెరువులు కనుమరుగయ్యే అవకాశాలున్నాయని స్పష్టం చేస్తున్నారు.

# సొసైటీ స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న గొంటి విక్రమ్‌యాదవ్

**సైఫాబాద్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** హైకోర్టు ఆదేశాలను దిక్కరించి తప్పుడు పత్రాలు సృష్టించి పార్కు స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపైన, అతడికి సహకరించిన ఎమ్మెల్యే, పోలీసులు, ఎంఆర్‌ఓ పై చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ నియోజక వర్గంలోని ఎల్లారెడ్డిగూడ, సంజయ్‌గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ కు విజ్ఞప్తిచేసింది. గురువారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ న్యాయ సలహాదారు గొంటి విక్రమ్‌యాదవ్, ఉపాధ్యక్షుడు ఎ.ఆర్.ప్రకాష్, నాగరాజు, లక్ష్మయ్య, ఉమేష్, శ్రీనివాస్, రాము మాట్లాడుతూ సంజయ్ గాంధీనగర్, తమ కాలనీలోగల సొసైటికి చెందిన 487 గజాల పార్కు స్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ప్రోద్భలంతో మురళీధర్ అనే వ్యక్తి 200 మంది పోలీసులు, ఎంఆర్‌ఓతో కలిసి వచ్చి అక్రమంగా స్వాదీనం చేసుకున్నారని ఆరోపించారు. దీంతో తాము హైకోర్టును ఆశ్రయించడం జరిగిందని, హైకోర్టు ఆ స్థలంలో ఏలాంటి జోక్యం చేసుకోవద్దని ఆదేశాలు జారీ చేసిందని అయిన ప్పటికి కోర్టు ఆదేశాలను దిక్కరించడంతో తాము కోర్టు తీర్పు దిక్కారణ కింద కేసు దాఖలు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే ఆదేశంతో ఆ స్థలంలో ఉన్న గోడ, గేట్లను కూల్చి కబ్జాదారులకు పోజిషన్ ఇప్పించారని ఆరోపించారు. జిహెచ్‌ఎంసి అధికారులు కూడా అక్రమ మోటెషన్ చేశారని, ఏలాంటి నిర్మాణం లేకుండా ఎమ్మెల్యే ఆదేశంతో ఏలా మోటెషన్ చేస్తారని వారు ప్రశ్నించారు. ఈ స్థలంపై నిలదీసిన సొసైటీసభ్యులను, కాలనీవాసులపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశామని, త్వరలోనే టి-పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బిఎస్‌పి అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసికి వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. అసోసియేషన్‌కు పార్కు స్థలాన్ని అప్పగించేవరకు న్యాయ పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.


ఎసిపిని సత్కరిస్తున్న నిరుడు కృష్ణ

## వినాయక ఉత్సవాలలో పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** వినాయక చవితి ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోలని దళిత సంఘర్షణ సమితి ప్రధాన కార్యాదర్శి నిరుడు కృష్ణ కోరారు. గురువారం చిలకలగూడ డివిజన్ ఏసీపీని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఏసీపీకి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద నిర్వాహకులు అన్ని భద్రతాపరమైన చర్యలు తీసుకునేలా చూడాలన్నారు.ముఖ్యంగా విద్యుత్ విషయంతో నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని కోరారు. వినాయక విగ్రహాల నిమజ్జన విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యాక్రమంలో డీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రగుడ్ల వెంకటేష్, చాకలి నాగేష్, జి. రవిశంకర్, అనిల్, నరేష్ తదితరుల పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో కెసిఆర్ దిష్టిబొమ్మ దహనం


కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బిజెపి శ్రేణులు

**ఫిల్మ్‌నగర్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** నిరుద్యోగ సమస్యపైన శాంతియుతంగా నిరసనదీక్ష చేస్తున్న కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అక్రమ అరెస్టుని నిరసిస్తూ జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిల్మ్ నగర్ చౌరస్తాలో గురువారం భాజపా కార్యకర్తలు కెసిఆర్ ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కెసిఆర్ డౌన్ డౌన్, బిజెపి జిందాబాద్, కిషన్‌రెడ్డి నాయకత్వం వర్థిల్లాలి అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, జూబ్లీహిల్స్ డివిజన్‌అధ్యక్షులు కస్తూరి మహిపాల్‌రెడ్డి, సైదులు శశి, బాలు, ఆదినారాయణయాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సోనియాగాంధీ సభను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి

**దుండిగల్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** తుక్కుగూడలోని రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో ఈనెల 17న సోనియాగాంధీ ముఖ్యఅతిథిగా నిర్వహించనున్న కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం కో-ఆర్డినేటర్ శశికళయాదవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది అమరుల త్యాగాన్ని గుర్తించి తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించిన మహాతల్లి సోనియాగాంధీ అన్నారు. విజయభేరి సభకు పెద్ద ఎత్తున్న తరలివెళ్ళి సోనియమ్మ రుణం తీర్చుకుందామన్నారు. నియోజకవర్గం నుండి 150వాహనాలలో 7500కు పైగా కార్యకర్తలతో సభకు వెళ్ళేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా డివిజన్లు, మున్సిపాలిటీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళానాయకురాల్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన కెఎంసి యాదవ సంఘం సభ్యులు


నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

**పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, కొంపల్లి మున్సిపాలిటీ నూతన యాదవకమిటీ సభ్యులు గురువారం ఎమ్మెల్యే వివేకానంద్‌ను ఆయన కార్యాలయంలో మార్యదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నూతన కమిటీకి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. యాదవుల సమస్యల పరిష్కారామే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షులు గోపాల్‌యాదవ్, ఉపాధ్యక్షులు సన్న రాజుయాదవ్, ఫాక్స్ డైరెక్టర్లు శ్రీనివాస్‌యాదవ్, కృష్ణయాదవ్, మధుసూదన్, సీనియర్ నాయకులు దేవేందర్‌యాదవ్, వేణుయాదవ్, మహేశ్‌యాదవ్, గిరియాదవ్, మురళియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి: బిజెపి

**నిజాంపేట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ రెండవ డివిజన్ పరిధి ఎన్ఆర్ఐకాలనీలో నిర్మాణంలో ఉన్న భవనం కూలిపోయిన విషయం విదితమే. నిర్మాణంపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. అనుమతులను రద్దు చేస్తూ నిర్మాణాన్ని పూర్తిగా తొలగించే ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. విషయం తెలుసుకున్న భాజపా నాయకులు అక్కడి చేరుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన నిర్మాణదారుడిపై మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పలువురు భాజపా నాయకులు పాల్గొన్నారు.


కూలిపోయిన నిర్మాణాన్ని తొలగిస్తున్న దృశ్యం


సిఎం కెసిఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బిజెపి నాయకులు

## కిషన్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా సిఎం దిష్టిబొమ్మ దహనం

**హైదరాబాద్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరాహారదీక్షను చేపట్టిన కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆనేక మంది కార్యకర్తలు సిఎం కెసిఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. గురువారం అంబర్‌పేట చౌరస్తాలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్.గౌతంరావు మాట్లాడుతూ రాష్ట్రంలో యువత భవిష్యత్తు కోసం కిషన్‌రెడ్డి చేస్తున్న పోరాటాన్ని సహించలేక రాష్ట్ర ప్రభుత్వం బిజెపి నాయకులపై దాడులకు తెరలేపిందని మండిపడ్డారు. రాష్ట్రంలో యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేవని, యువత ఉద్యోగాల కోసం ఆనేక ఇబ్బందులకు గురవుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఆనంద్‌గౌడ్, వనం రమేష్, శ్యాంరాజ్, నాగభూషణ్‌చారి, ప్రవీణ్‌కుమార్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి నిరసన దీక్షను భగ్నం చేయడం సరైంది కాదు


ఆందోళన చేస్తున్న బిజెపి నేతలు

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి బుధవారం తలపెట్టిన నిరుద్యోగ నిరసన దీక్షను భగ్నం చేసినందుకుగాను గురువారం సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద నిర్వహించిన నిరసన ప్రదర్శనకు బిజెపి నాయకురాలు కొంతం దీపిక ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. నిరుద్యోగ నిరసన దీక్షను శాంతియుతంగా నిర్వహిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం భగ్నం చేయడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సామల సత్తిరెడ్డి, టోపీ శంకర్, విజయానంద్, రాపోలు మాధురి, భాగ్యలక్ష్మి, అనురాధ, రాజ్ మల్లేశ్,చారి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో నియంతృత్వ పాలన : ఠాకూర్ యోగిరాజ్‌సింగ్


కిషన్‌రెడ్డి దీక్షలో ఠాకూర్ యోగిరాజ్ సింగ్

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతుందని బిజెపి కార్వాన్ నియోజకవర్గ యువ నాయకులు ఠాకూర్ యోగిరాజ్‌సింగ్ అన్నారు. గడీల పాలనను అంతమొందించే రోజులు దగ్గరపడ్డాయన్నారు. నిరుద్యోగులను దగాచేసిన బిఆర్ఎస్ సర్కార్‌కు వ్యతిరేకంగా బిజెపి ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం కిషన్‌రెడ్డి చేస్తున్న దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల ఉద్యమాలతో ఏర్పడిన తెలంగాణలో నేడు యువకులకు ఉద్యోగాలకు లేకుండా పోయాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంలో మాత్రం ఒక్కరు కూడా నిరుద్యోలు లేరని ఎద్దేవ చేశారు. ప్రశాంత వాతావరణంలో దీక్ష చేస్తున్న కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం కిషన్‌రెడ్డి దీక్షను పోలీసులు భగ్నం చేయడమేమిటని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర పోలీసులు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల్లా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు.

## కొల్లాపూర్ సభను విజయవంతం చేయాలి

### లాస్య నందిత

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** ఈ నెల 16న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం సందర్భంగా కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ వద్ద సిఎం కేసిఆర్ నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేసేందుకు బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం కార్ఖానలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశమై సిఎం కేసిఆర్ సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, జిహెచ్‌ఎంసి మాజీ కో-ఆప్షన్ సభ్యుడు నరిసింహ ముదిరాజ్, బిఆర్ఎస్ నేతలు సదానంద్ గౌడ్, పనస సంతోష్ గౌడ్,నారాయణ, రాము, రాజయ్య, కిరణ్,పెంట శ్రీహరి, మురళీ యాదవ్, భాస్కర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


కంటోన్మెంట్ బిఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశమైన అభ్యర్థి లాస్య నందిత

## పార్లమెంట్‌లో ఎస్సీవర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి


అడ్డగుట్టలో దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

**అడ్డగుట్ట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** ఈనెల 18 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీ ఎస్ నాయకులు వేణుగోపాల్‌మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద క్రిష్ణమాదిగ పిలుపుమేరకు గురువారం అడ్డగుట్టలో ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ మహా దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ నెల 17న హైదరాబాద్‌లో జరిగే కాంగ్రెస్ సభలో వర్గీకరణ తీర్మాణంపై కాంగ్రెస్ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు స్యామెల్ మాదిగ, లతామాదిగ, మహేశ్‌మాదిగ, సుజాతమాదిగ, బాలమణి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుల బస్తీబాట

**అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని చుడీబజార్‌లో బిఆర్ఎస్ యువ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్ యాదవ్ బస్తీ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు గాను కృషి చేస్తానన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కెసిఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్దలతో జరుపుకోవాలి



గణేష్ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన సీడీని ఆవిష్కరిస్తున్న మిత్ర

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్దలతో జరుపుకోవాలని కార్వాన్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. ఈనెల 18 నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతుండడంతో గురువారం మెహిదీపట్నంలోని పార్టీ కార్యాలయంలో ఆసిఫ్‌నగర్‌కు చెందిన సాయి దత్తా సాయి గణేష్ ఫౌండేష్ ఆధ్వర్యంలో గణనాధుని పాటల సీడీనీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మిత్ర కృష్ణ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నవరాత్రుల పాటు ప్రత్యేక పూజలందుకునే గణనాధుని మండపాల వద్ద ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం ఆసీఫ్‌నగర్ గణనాధునికి సంబంధించిన పాటల సీడీనీ ఆవిష్కరించారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ యువ నాయకులు మిత్ర అభిషేక్, గోపి, విజయ్, శివ, ఆకాష్, నాగుల్, రాహుల్ ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన


ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కూరాకుల కృష్ణ

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్వాన్‌లో నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచారానికి విశేషస్పందన లభిస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఏ-బ్లాక్ అధ్యక్షులు కూరాకుల కృష్ణ తెలిపారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా గురువారం గుడిమల్కాపూర్, కార్వాన్ డివిజన్ల పరిధిలోని అల్లూరిసీతారామరాజునగర్, సాయినగర్, బాలాజీనగర్, సత్యనారాయణ నగర్‌లలో ప్రచారం నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూరాకుల కృష్ణ మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసింది, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. ఆయన వెంట నాయకులు ముంగి రఘుపాల్‌రెడ్డి, ఆకుల చంద్రశేఖర్, అబ్దుల్ అహ్మద్, గిరి, వినోద్‌సింగ్, రామ్‌కుమార్, ప్రేమ్ కిషోర్, గోవర్ధన్‌రెడ్డి, సతీష్, వంశీ, నర్సింహారెడ్డి, ముని బేగం, వనజాత, జ్యోతి, సుజాత, అనురాధ కార్యకర్తలు ఉన్నారు.

## ప్రజాదరణ చూసి ఓర్వలేకే మాజీ సిఎం చంద్రబాబుపై అక్రమ కేసులు

**చిక్కడపల్లి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** ప్రజాదరణ చూసి ఓర్వలేకే మాజీ సిఎం, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడిందని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వల్లభనేని ప్రసాద్, కె.వెంకటేశ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి వి.భారతి విమర్శించారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో వారు మాట్లాడారు. జనాధరణ చూసి తట్టుకోలేక, దివ్యాంగుల బధిరులకు ఎలాంటి చదువులు నిమిత్తం లేకుండా ఉచితంగా 3జి2 మొబైల్స్ మూడు చక్రాల మోటారు వాహనాలు పంపిణీ సహా తదితర దివ్యాంగుల సంక్షేమ పథకాలు పంపిణీ చేసినా 14 సంవత్సరాలుగా చంద్రబాబునాయుడును కుట్రపూరితంగా అక్రమకేసులో ఇరికించి అరెస్టుచేయడం తగదన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు లేకుండా అర్ధరాత్రి హౌజ్ అరెస్టుల పేరు నివాసాల వద్ద కాపలాగా ఉంచడం అన్యాయమన్నారు. తక్షణమే మాజీ సిఎం చంద్రబాబునాయుడుని వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## డయల్ యువర్ ఆర్ఎం

**బేగంబజార్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** టిఎస్‌ఆర్‌టిసి రంగారెడ్డి రీజియన్ పరిధిలోని మహాత్మాగాంధీ బస్‌స్టేషన్, జెబిఎస్ దిల్‌సుఖ్‌నగర్ బస్టాండుల నుండి బయలు దేరే జిల్లా సర్వీసుల గురించి ఈనెల15 తేదిన డయల్ యువర్ ఆర్.ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి రీజినల్ మేనేజర్ ఎ.శ్రీధర్ తెలిపారు. హైదరాబాద్-1, హైదరాబాద్-2, పికెట్, మియాపూర్-1, బిహెచ్‌ఈఎల్, పరిగి, తాండూర్, వికారాబాద్ డిపోలకు సంబంధించిన సలహాలు, సూచనలు, ఫిర్యాదులను ప్రయాణికులు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు రీజినల్ మేనేజర్ ఫోన్ చేయవచ్చునన్నారు. జిల్లా బస్సులు, సిటి బస్సులు కోసం ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

## ఓటర్ ఐడి కార్డులను త్వరగా ధ్రువీకరణ చెయ్యాలి

**ఫిల్మ్‌నగర్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** 8నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఓటర్ ఐడికార్డులు, త్వరగా, గడువులోగా ధ్రువీకరణ చేయాలని, అదేవిధంగా గృహలక్ష్మీ పథకం కింద అప్లై చేసుకున్న వారిలో అర్హులైన లబ్దిదారులను గుర్తించాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ కోరారు. గురువారం ఫిల్మ్‌నగర్‌లోని కార్పొరేటర్ డివిజన్ కార్యాలయంలో జిహెచ్ ఎంసి ఆర్‌పిలు, బిఎల్ఓలతో సమావేశం జరిగింది. ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

## అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

**నాచారం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** మల్లాపూర్ డివిజన్‌లో అభివృద్ధి పనుల కోసం నిధులు కెటాయించాలని జీహెచ్‌ఎంసీ కమీషనర్ రోలార్డ్ రాస్‌ను కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. అందుకు కమీషనర్ సానుకూలంగా స్పందించినట్లు పన్నాల పేర్కొన్నారు. పన్నాలతో పాటు బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మేల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్, సీనియర్ నాయకులు తాడూరి శ్రీనివాస్, సాయిజన్ శేఖర్ తథితరులు పాల్గొన్నారు.

## మాజీ సిఎం చంద్రబాబునాయుడు అరెస్ట్ అక్రమం

**నిజాంపేట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్ట్ అక్రమమని, తీవ్రంగా ఖండిస్తున్నామని నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షులు వాకలపూడి రంగరాయ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ రాజకీయ కక్షతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్ల వ్యవహరించిని తీరు దుర్మార్గం. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల మద్దతుతో గెలవాలి, రాజకీయ వేధింపులకు గురిచేయడం సరికాదు. అణిచివేత రాజకీయాలు ప్రజాస్వామ్యానికి గొడ్డలపెట్టులాంటివి. భారతీయజనతా పార్టీ కనుసన్నల్లోనే వైసిపి మాజీ సిఎంను అక్రమంగా అరెస్ట్ చేశారు. అక్రమ అరెస్ట్‌లతో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. ఇటువంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

## కార్మికులు విధుల్లో జాగ్రత్తగా ఉండాలి

### కొంపల్లి పురపాలక చైర్మన్ శ్రీశైలంయాదవ్

**కొంపల్లి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** పారిశుధ్య కార్మికులు విధుల్లో జాగ్రత్తగా ఉండాలని కొంపల్లి పురపాలిక చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. గురువారం కార్యాలయంలో కార్మికులకు సబ్బులు, నూనె, బెల్లం తదితర సామాగ్రిని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు విధి నిర్వాహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యం పట్ల శ్రద్ద వహించాలని సూచించారు. కార్యక్రమంలో కమీషనర్ శ్రీహరి, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**దుండిగల్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** విద్యుత్ తీగలకు అడ్డుతగులుతున్న చెట్లకొమ్మలను తొలగించడంలో భాగంగా దొమ్మరపోచంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి ఇండోఫ్యాబ్ ఫీడర్ పరిధిలోని వివేకానంద్‌నగర్, సురక్ష, గాయత్రినగర్, హోలిచైల్డ్‌స్కూల్, ఇందిరానగర్‌కాలనీ, దుండిగల్ పోలీస్ స్టేషన్, చంద్రశేఖర్‌రెడ్డినగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9:30గంల నుండి మధ్యాహ్నం 1:30గంల వరకు, సత్యం ఫీడర్ పరిధిలోని శ్రీక్రిష్ణా కాలనీ, నిరంజన్‌రెడ్డికాలనీ, గండిమైసమ్మ ఎక్స్‌రోడ్స్, పోచిరెడ్డికాలనీ, విశాల్‌మార్ట్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంల నుండి సాయంత్రం 5:30గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహకరించాల్సిందిగా ఏఈ కోరారు.

## కెవిఆర్‌వ్యాలీలో సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన

**దుండిగల్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** దుండిగల్ మున్సిపాలిటీ పరిధి 26వ వార్డులోని కెవిఆర్‌వ్యాలీ 10వ రోడ్డులో రూ.28లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సిసిరోడ్డు పనులను కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు అవసరాలకు అనుగుణంగా మౌళికవసతులు కల్పిస్తామన్నారు. చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీతయ్య, తిరుమలేషన, శ్యామ్, చంద్రశేఖర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 3న ఆర్‌పిఐ వ్యవస్థాపక దినోత్సవం

**సైఫాబాద్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథావాలె) 67వ వార్షక, వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు అక్టోబరు 3వ తేదీన సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఆ రోజున వేలాది మంది కార్యకర్తలతో ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ గ్రౌండ్ నుంచి పెరేడ్‌గ్రౌండ్ వరకు భారీగా ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం భారీ బహిరంగ సభ జరుగుతుందని పార్టీ ప్రతినిధులు తెలిపారు. సభలో కేంద్ర మంత్రి రాందాస్ అథావాలె, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని ప్రతినిధులు చెప్పారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు డా. ఎం.వెంకటస్వామి, శ్రావణ్‌కుమార్, శివరాజ్, స్నేహలత తదితరులు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడటానికి, ప్రజలపక్షాన నిలబడటానికి ఆర్‌పిఐ వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా పోటీచేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టిలు అధికారంలోకి రావాలని, పోరాడి సాధించుకున్న తెలంగాణలో అందరికి సామాజిక న్యాయం జరగాలని, దొరల పాలు కారాదని చెప్పారు.

## 14 ఏళ్లుగా అన్నదానం : జంపన ప్రతాప్

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** 1వ వార్డు బాపూజీ నగర్ లోని శ్రీదేవీ నల్లపోచమ్మ దేవాలయంలో 14 ఏళ్ల నుంచి ప్రతి అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. అమావాస్యను పురస్క రించుకొని గురువారం నల్లపోచమ్మదేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రేమ్‌ముదిరాజ్, దుర్గయ్య, జహింగీర్, శ్రీకాంత్, అజీత్, రామారావ్ పాల్గొన్నారు.

## కుటుంబ పాలనకు స్వస్తి పలకాలి : శ్రీగణేష్

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కంటోన్మెంట్ ప్రజలు కుటుంబ పాలనకు స్వస్తి పలకాలని ఎస్‌జిఎఫ్ ఫౌండర్ ఎన్.శ్రీగణేష్ తెలిపారు. గురువారం కంటోన్మెంట్ 4వ వార్డులోని పికెట్ లక్ష్మీనగర్, గాంధీకాలనీ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉచిత మహిళా శిక్షణా కేంద్రాలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ కంటోన్మెంట్ మహిళలకు ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో వివిధ రకాల కుట్టు శిక్షణ, ఎంబ్రైడరీ, అల్లికలు,పాపడాల తయారీ వంటి వివిధ రకాల శిక్షణ మూడు సంవత్సరాల నుంచి ఇస్తున్నామన్నారు. మహిళలు ఆయా శిక్షణలో ప్రతిభకబర్చి మరి కొందరికి ఉపాధి కల్పించే విధంగా అభివృద్ధి చెందాలన్నారు. వారికి భవిష్యత్తు కల్పించిన వారిని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నుకోవాలన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తిని ఎన్నుకోవాలన్నారు. కల్లబొల్లి మాటలతో ఓట్లు దండుకునేందుకు వచ్చే కుటుంబ పాలన వ్యక్తులకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు.

**కట్టమైసమ్మ దేవాలయంలో అన్నదానం...**

అమావాస్యను పురస్కరించుకొని బోయిన్‌పల్లి కట్ట మైసమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్.జి.ఎఫ్. అధినేత శ్రీగణేష్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు క్రాంతి, సాయి, అరుణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

**బేగంబజార్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధపడుతున్న మల్లేష్ సిఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును ప్రభుత్వ విప్ ఎస్.ఎం.ప్రభాకర్‌రావు, నాంపల్లి నియోకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్. ఆనంద్‌కుమార్‌గౌడ్ అందచేశారు. వైద్యం కోసం దరఖాస్తు చేసుకున్న మల్లేష్‌కు రూ. 60 వేల అందచేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గోశాలలో ఆవులకు పూజలు

**అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** అమావాస్యాన్ని పురస్కరించుకుని శుక్రవారం గోషామహల్ నియోజకవర్గంలో ఉన్న గోశాలల్లో ఆవులకు భక్తులకు తమకు తొచ్చిన విధంగా ఆహారాన్ని అందచేశారు.అమావాస్యాన్ని పురస్కరించుకుని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఇమ్లీబన్‌లోని గోశాలల్లో గోవులకు తెలంగాణ భజరంగా సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మణ్ రావుగుప్త గడ్డివేసి పూజలుచేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీనివాస్ గుప్త, రాజేందర్, నందకిషోర్ అగర్వాల్, మనోజ్ మొగలిది, శ్రీనివాస్, అరుణ సింగ్, ఎస్.కె.శర్మ, అశిష్‌రాధాశ్యామ్, శేఖర్ పాల్గొన్నారు.

